


గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి : గోదా శ్రీరాములు


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 21 డిసెంబరు , 2025 | పేజీలు : 06




మధురమైన అనుభూతి

# లాంచీ యాత్ర

### విజయవంతంగా నాలుగో వారం కొనసాగిన సాగర్ టూ శ్రీశైలం ప్రయాణం

**ప్రజాపక్షం/నందికొండ:** ఏడాది విరామం తర్వాత నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం యాత్ర నవంబర్ 29 న మొదటి యాత్ర ప్రారంభం కాగా గత వారం మూడవ యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకుని మళ్లీ ఈ శనివారం నాలుగవ యాత్రకు బయలుదేరింది. వారం వారం పబ్లిసిటీ జరగడంతో లాంచీ స్టేషన్ నుంచి సాగర్ జలాశయం మీదుగా తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన లాంచీలో శ్రీశైలం వెళ్లేందుకు శనివారం విద్యార్థులు,పర్యాటకులు ఆసక్తి చూపించారు. ఈ యాత్ర దట్టమైన నల్లమల అడవుల మధ్య కృష్ణవేణి తరంగాలపై లాంచీలో ప్రయాణం అనేది ఒక మధురమైన అనుభూతిని కలిగిస్తుంది నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నదిలో 6 గంటల పాటు సాగే సుధీర్ఘ లాంచీ ప్రయాణం ఆనందాన్ని ఆహ్లాదాన్ని పంచిస్తోంది అనడంలో ఎటువంటి సందేహం లేదు తెలంగాణ పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చిన ఈ యాత్ర నాల్గవ వారం విజయవంతంగా కొనసాగింది .పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకోవడంతో శనివారం సాగర్ వ ద్ద పర్యాటకుల సందడి నెలకొంది. శ్రీశైలం యా త్ర ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి లాంచీ బయలుదేరి శ్రీశైలానికి సాయంత్రం 3 గంటలకు చేరుకుంటుందని మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి నాగార్జునసాగర్ కు సాయంత్రం 3 గం టలకు చేరుకుంటుందని తెలంగాణ పర్యాటకశాఖ తెలిపింది.

# రానున్న రోజులు మనవే.. కార్యకర్తలు అధైర్య పడొద్దు!

### మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి




**ప్రజాపక్షం/హాలియా:** మరో రెండేళ్లలో మన పార్టీ అధికారం చేపట్టబోతుందని కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం హాలియాలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో టిఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులకు పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాలియా ప్రధాన కూడలి నుండి లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు టిఆర్ఎస్ వైపు చూస్తున్నారని మన వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికలే అందుకు నిదర్శనమని చెప్పారు. సుమారు 45 శాతం పైనే సర్పంచులను టిఆర్ఎస్ పార్టీ గెలుచుకోవడం కార్యకర్తల కృషి పట్టుదలతో పాటు పార్టీకి ప్రజల మద్దతు ఉందని నిరూపితమైందని తెలిపారు. పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల పనిచేసే విజయ దుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర నాయక్ అధ్యక్షత వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఆప్కాబ్ చైర్మన్ ఎడవల్లి విజయేందర్ రెడ్డి, ఇస్లావత్ రామచంద్రనాయక్, పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, కేతావత్ బిక్ష నాయక్, వర్ర వెంకటరెడ్డి,సుందర్ రెడ్డి, కూరాకుల అంతయ్య, రవి నాయక్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం వి.సి సమావేశ మందిరంలో రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని అన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి ఇకపై అక్కడ ప్రమాదాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకించి పోలీస్ శాఖ గుర్తించిన బ్లాక్ స్పాట్లు, సూచించిన ప్రదేశాలలో ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, అలాగే ఇతర శాఖలు పూర్తి సహకారం అందించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే మీద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ పటిష్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలుచేయాలన్నారు. అవసరమైన చోట్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏసీపి లక్ష్మీ నారాయణ, ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డిఓ కృష్ణారెడ్డి, జిల్లా రోడ్లు భవనాల అధికారి సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 ఫలితాలలో బొడ్డు లింగరాజు ప్రతిభ



**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకటించిన గ్రూప్3 ఫలితాలలో మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన బొడ్డు యలమంచి మంగమ్మ ల కుమారుడు బొడ్డు లింగరాజు ప్రతిభచూపి ఇంటర్మీడియట్ బోర్డులో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. బొడ్డు లింగరాజు ఒకటి నుండి 10వ తరగతి వరకు బరాఖత్‌గూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ కోదాడలోని క్రాంతి కళాశాల, డిగ్రీ కోదాడ త్రివేణి డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ మా అమ్మ ప్రోత్సాహంతోనే చదువుకుని ఈ ఉద్యోగం సాధించానని, గ్రూప్2లో ఉద్యోగం సాధించాలన్నదే నా పట్టుదల అని తెలిపారు.

# అన్నదానం మహాదానం



**ప్రజాపక్షం/కోదాడ:** అన్నదానం మహాదానమని మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్ అన్నారు. శనివారం కోదాడ పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని గాలి రమేష్‌నాయుడు జ్ఞాపకార్థం గాలి శ్రీనివాస్‌నాయుడు అధ్వర్యంలో సన్నిదానంలో నిర్వహిస్తున్న అన్నదానా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీతరాంసింగ్, నాగరాజు, కందిబండ మోహన్‌రావు, శ్రీనివాసరావు, కోట రాంబాబు, వెంకటేశ్వర్లు, రామారావు, విజయ్, ఉపేందర్, గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి బాటలు

**ప్రజాపక్షం/మోతె :** గ్రామాభివృద్ధికి బాటలు వేస్తానని కొత్తగూడెం గ్రామ సర్పంచ్ శేషిరెడ్డి అన్నారు. ఆయన శనివారం ప్రజాపక్షం ప్రతినిధితో మాట్లాడుతూ గ్రామంలో సుమారు 550 ఓట్లు మాత్రమే ఉన్నాయని, గ్రామ పంచాయితీ భవనం కూడా లేదని నూతన భవనం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణం చేయడంతోపాటు కొత్తగూడెం నుంచి రామచంద్రాపురం వరకు రహదారి ఏర్పాటు చేసి వ్యవసాయ భూములకు వెళ్ళడానికి డొంకదారులన్నీ రహదారులుగా మార్చడానికి కృషి చేస్తానని చెప్పారు. ఎస్‌సి కాలనీలో విద్యుత్ సమస్య ఉన్నదని, కరెంట్ స్థంబాలు అవసరం కూడా ఉందని వివరించారు. ప్రతి వీధిలో దీపాల కోసం విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.

# మహా గణపతి హోమం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మొటకొండూర్ మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మహా గణపతి హోమంను గురుస్వామి భాస్కరుణి రఘునాథరాజు ఆధ్వర్యంలో శబరిమల యాత్ర చేయుచున్న స్వాముల కోసం మహా గణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎగ్గిడి కృష్ణ గురుస్వామి, బచ్చా శ్రీశైలం, దయ్యాల పాండు, సిరబోయిన వెంకట్, బాల్ద నరసింహా, రేగు చంద్రశేఖర్, రేగు ప్రభాకర్, బల్దా మధు, రేగు అశోక్ మాలధారణ స్వాములు గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యమే




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ తెలిపారు. క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో మెలిగి ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఆమె ఉద్బోధించారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవి, డీఈవో సత్యనారాయణలతో కలిసి 9 జెడ్పి పాఠశాలలకు చెందిన 321 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.1.80 లక్షల విలువైన స్నాక్స్, నీళ్ల సీసాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆమె చేతుల మీదుగా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 10వ తరగతి విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు రిలయబుల్ ట్రస్ట్ ముందుకొచ్చినందుకు అభినందనలు తెలిపారు. పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని అ న్నారు. డిఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ చదు వు సంస్కారం నేర్పుతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. జెడ్పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, దీపా జోషి, హనుమంతు, ఉదయ పాల్గొన్నారు. నూరు శాతం హాజరు ఉన్న విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు.

# మేనేజ్‌మెంట్ పద్ధతులను విద్యార్థులు అర్థం చేసుకోవాలి




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఆధునిక మేనేజ్మెంట్ పద్ధతులను విద్యార్థులు తేలికగా అర్థం చేసుకోవాలని అన్నారు. భువనగిరి మండల పరిధిలోని రాయగిరి గ్రామంలో యూనిటీ పీజీ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సమకాలీన నిర్వహణ పద్ధతిలో ఉద్భవిస్తున్న ధోరణిపై అతిథి ఉపన్యాసంను శనివారం యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు మాట్లాడుతూ పరిశ్రమల్లో వస్తున్న మార్పులను బట్టి విద్యార్థులు చదువును తేలికగా అర్థం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తు అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల వృత్తి, నైపుణ్యాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో యూనిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఏ.ప్రభాకర్ రెడ్డి, డైరెక్టర్లు సోమ్ చందు, పి.గోవర్ధన్ రెడ్డి, యూనిటీ పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సరిత, యూనిటీ ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి శ్రీనివాస్, ఏవో పి.సునీత, హెచ్వోడి జి.సురేష్, ఉపాధ్యాయ బృందం వి.రాధ, సంపత్, నాగరాణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# తుర్కపల్లిలో కాంగ్రెస్ నాయకుల సస్పెండ్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరిజిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలలో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తూ, క్రమశిక్షణ తప్పిన నాయకులను కాంగ్రెస్ పార్టీనుండి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు ధనావత్ శంకర్ నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసి, ఇతర పార్టీల అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు మూడు సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని మాదాపూర్ గ్రామం నుండి కోమిరిశెట్టి నరసింహులు, పంది ఉప్పేందర్, చిన్న లక్ష్మ పూర్ గ్రామంలో మేడిపల్లి ఆగభూషి, పిన్నపు రెడ్డి, భూపాల్ రెడ్డి, ర్యాకల పోచయ్య, ధర్మారంలో మహమ్మద్ ఆసద్ బేగ్, తుర్కపల్లిలో పసుల సత్యనారాయణ సస్పెండ్ చేసినట్లు, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు భాస్కర్ రెడ్డి, ఐనాల మహేందర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, గడ్డమీది నిఖిల్, మోహన్ బాబు నాయక్, ఇంద్రపాల కృష్ణ, హన్మంత్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మన్నెవారి పంపు నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని మన్నెవారిపంపు గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటిని మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, టీపీసీసీ డెలికేట్ తంగళ్లపల్లి రవి ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ నూతన అధ్యక్షునిగా బోయిని రాంబాబు, ఉపాధ్యక్షులుగా గుండ్ల సందీప్ రెడ్డి, అంకర్ల కిషన్, ప్రధాన కార్యదర్శులుగా గంగదేవి కొండల్, మేడబోయిన జహంగీర్, కార్యదర్శులు ఎల్లమల రామకృష్ణ రెడ్డి, మేడబోయిన మధు, సంయుక్త కార్యదర్శులు మల్లెబోయిన జంగయ్య, బోయిని రాజు, కోశాధికారులుగా జూపల్లి మహేష్, బోయిని సాయి కిరణ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. గుండ్ల నర్సిరెడ్డి, గుజ్జ వెంకటేశం, ఏంపల్ల జగ్గారెడ్డి, గంగదేవి రవి, బోయిని నర్సింహ, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.



# యాప్ బుకింగ్ వద్దు సొసైటీ, డీలర్ల ద్వారా యూరియా సరఫరా చేయాలి

**ప్రజాపక్షం/మునగాల:** రబీ సీజన్ డిసెంబర్ 20 తేదీ నుంచి స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు యూరియా సరఫరా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన రైతాంగానికి ఎలాంటి ఉపయోగం లేదని ప్రభుత్వం తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు స్మార్ట్‌ఫోన్లు ఉపయోగించే అవగాహన లేని రైతులు యూరియా పొందడం కష్టమవుతుందన్నారు. పాత పద్ధతలో యూరియాను అందిస్తే రైతులు ఇబ్బందులు పడకుండా తీసుకుంటారని అన్నారు. లేనియేడల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# గోదాదేవికి సారె బహుకరణ



**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీ లక్ష్మి నర్సింహస్వామిగోదాదేవికి ధనుర్మాసం సందర్భంగా శనివారం జరిగే కార్యక్రమంలో హుజూర్‌నగర్‌కు చెందిన వికాస తరంగిణి అధ్యక్షురాలు కొత్త కళావతి ఆధ్వర్యంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా పూలు, పండ్లు వస్త్రాలతో సారె సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. దేవాలయ కమిటిచైర్మన్ మధుసూదన్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై శేషాచార్యులు, లవకుశచార్యులు, వికాస తరంగిణి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును ఉపసంహరించుకోవాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జీరాంజీ బిల్లు వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీవ్రమైన నష్టం కలిగిస్తుందని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నల్లాల బావి సెంటర్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ కొత్త బిల్లును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, ధనియాకుల శ్రీకాంత్, సత్యం పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహాత్మగాంధీ ఉపాది హామి చట్టాన్ని కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. పేదలకు ఉపాది కల్పించే ఉపాది హామీ పథకం పోరాడి సాధించుకుందామని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ పథకానికి పేరు మార్చడంతోపాటు ఆ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి పాల్గొన్నారు.



## కుక్ పోస్టుకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని కేజీబీవి పాఠశాల నందు ఖాళీగా ఉన్న కుక్ మహిళా పోస్టుకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను తేది 21 నుండి 22 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కేజీబీవి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకునే వారు 7వ తరగతి పాస్ అయ్యి ఉండాలని అన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఆదివారం, సోమవారం రోజులలో ఉదయం 9.30 నిమిషాల నుండి సాయంత్రం 4.30 నిమిషాల వరకు కేజీబీవి పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## రైతు బజార్ పరిశీలన



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరిలోని రైతు బజారును జిల్లా అదనపు కలెక్టర్ విరారెడ్డి శనివారం పరిశీలించారు. రైతు బజార్లో నెలకొన్న సమస్యలను స్థానిక అక్కడ వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, వసతుల గురించి మాట్లాడారు. మార్కెట్లో వసతులు కల్పించేందుకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు యాట నాగరాజు, శ్రీనివాసు, భూమయ్య, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గరిడేపల్లి మండల వాసవిక్లబ్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా పోతుగంటి చంద్రశేఖర్, కోశాధికారిగా మేళ్లచెరువు రమేష్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ గతంలో కంటే ఎక్కువగా సేవా కార్యక్రమాలు నిర్వహించి మంచి ప్రతిభ కనబరుస్తామని అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటి నుండే యూరియా బుక్ చేసుకునేలా ప్రత్యేక మొబైల్ యాప్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం వ్యవసాయ, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా తహశీల్దార్ హరి కృష్ణ మాట్లాడుతూ యూరియా, ఎరువుల కోసం రైతులు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల చుట్టూ క్యూలో నిలబడి పడుతున్న ఇబ్బందులకు ప్రభుత్వం ముగింపు పలకాలని నిర్ణయించి రైతులు తమ ఇంటి నుండే యూరియాను బుక్ చేసుకునే విధంగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో ఎంపిడివో చంఢీ రాణి, ఎంపివో సలీం, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారణ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు 2026లకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, రవాణాశాఖ కమీషనర్ వికాస్‌రాజ్‌లతో కలిసి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, రవాణా శాఖ, విద్యాశాఖ, వెల్ఫేర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో పోలీస్, రవాణా, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయితీ రాజ్ శాఖలు సమన్వయం చేసుకుంటూ జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించడం జరిగిందన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 26 శాతం మరణాలు, 9 శాతం ప్రమాదాలను తగ్గించడం జరిగిందని వచ్చే సంవత్సరానికి సంబంధించి అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఇట్టి సమస్యను పరిష్కరించే దిశగా 18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వకూడదన్నారు. అదే విధంగా ట్రాఫిక్ నిబంధనలు విద్యార్థులకు, యువకులు తెలియజేసేలా పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్‌టిసి బస్సులు, లారీలు రోడ్డుపై ఆపకుండా పక్కన ఆపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించి ప్రాణాలను కాపాడిన వారిమి అవుతామని ఇట్టి విషయాన్ని అధికారులు సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా ఎస్పి కె నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ఆర్‌డిఓ జయప్రకాష్‌రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, పశుసంవర్ధన అధికారి శ్రీనివాసరావు, ఇండస్ట్రీయల్ జిఎం సీతారాం, వెల్ఫేర్ అధికారులు శంకర్, నరసింహా రావు, దయానందరాణి, డిఇఓ అశోక్ పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిజర్ బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎరువుల దుకాణాల వద్ద ఆయన రైతులకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులు యూరియాను సులభంగా త్వరితగతిన పొందేందుకు ప్రభుత్వం ఈ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా యూరియా ఎక్కడ అందుబాటులో ఉందో రైతులు తెలుసుకోని యాప్‌లోని బుకింగ్ చేసుకోని, సంబంధిత షాప్ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో హాజరై సులభంగా యూరియాను పొందవచ్చని తెలిపారు. ఈ యాప్ ద్వారా పారదర్శకత పెరుగుతుందని, యూరియా బ్లాక్ మార్కెట్‌కు అవకాశమే ఉండదని అన్నారు. యాప్ వినియోగంపై ఎలాంటి సందేహాలున్న రైతులు తమకు సమీపంలోని ఏఈవోలను సంప్రదించాలని అన్నారు. అదేవిధంగా ఎరువుల డీలర్లు ఈపాస్ ఆధారంగా యూరియాను విక్రయించాలని, రోజువారి రికార్డులను అప్‌డేట్ చేస్తూ ఉండాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన యువత ఆల్కాహాల్, మాదకద్రవ్యాల నుండి అత్యంత దూరంగా ఉండాలని సూర్యాపేట ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డాక్టర్ ఎం రాధాకృష్ణ చౌహాన్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో నష్టాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జనబంధు ఫౌండేషన్, హోలిక్రాస్ ఫౌండేషన్, జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదకద్రవ్య నిర్మూలన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానాలతో యువత జీవితం చెడిపోకుండా ప్రతి ఒక్కరూ ఉద్యమంలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటి కార్యదర్శి (ఎఫ్ఏసి) ఫర్హీన్‌కౌసర్ మాట్లాడుతూ సినిమాలు, సోషల్‌మీడియాతో యువత డ్రగ్స్‌వైపు ఆకర్షితులవడం విచారకరమన్నారు. ఒత్తిడికి యోగా, ధ్యానం, క్రీడలు వంటివి ఉత్తమ మార్గాలను వాటిని ఎంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్య ముక్త సమాజం కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జనబంధు, హోలీక్రాస్ స్థాపకుడు గోదా సత్యనారాయణ, మిడతపల్లి గణపతి, బార్ కౌన్సిల్ సభ్యులు అధ్యక్షులు కొంపల్లి లింగయ్య, రాచకొండ ప్రభాకర్, డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ కోఆర్డినేటర్లు కంది కావేరి, నల్లగట్టు ఉపేందర్, జనబంధు ప్రతినిధులు ఝాన్సీరాణి, ఎరకలి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా స్లాట్ బుకింగ్‌పై శిక్షణ

**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : రైతులు ఈ రబీ సీజన్లో తమ పంట అవసరాలకు కావలసిన యూరియా కొరకు మొబైల్ యాప్ (పెర్టిలైజర్ యాప్)ద్వారా మీకు దగ్గరలోని ఫెర్టిలైజర్ షాప్‌లలో బుక్ చేసుకొనడానికి మాత్రమే అవకాశం కలదు. కావున రైతులందరూ తప్పనిసరిగా యాప్ ద్వారా బుకింగ్ చేసుకొనవలసినదిగా తెలుపుతూ రైతులందరికీ ఈ విషయంలో అవగాహన కల్పించాలని ఏఈఓ, పంచాయతీ కార్యదర్శి , జిపిఓలకు ఈ సమావేశం ద్వారా తెలుపబడినది. ఈ సమావేశంలో తహసీల్దార్ శేషగిరి రావు, ఎంపిడిఓ శంకరయ్య, ఏఓ పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిర్వీర్యమే కేంద్రం లక్ష్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధి హామి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని సీపీఐ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు చెవిలో పువ్వులు పెట్టాలంటే అది బీజేపీకి సాధ్యమన్నారు. పథకాల పేర్లు మార్చి పేదలను మోసం చేయాలని నిధులు తగ్గించి ప్రజలకు ఉపాది లేకుండా చేయాలనే కుట్రపూరితమైన కార్యాచరణకు బీజేపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. ప్రధానమంత్రి మోది ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారని అన్నారు. కోట్లాది మంది గ్రామీణ పేద ప్రజలకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, పథకాన్ని మార్చాలని చూస్తే గ్రామీణ కార్మికులు, కర్షకులు, రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడ్తామని ఆయన హెచ్చరించారు.

## సర్పంచ్ ఫలితాలే వారికి చెంపపెట్టు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేం పార్టీ లేదనే వారికి ఇటీవల రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిచిన ఫలితాలే చెంపపెట్టు అని తెలంగాణ తెలుగుదేశంపార్టీ నాయకులు పోగుల సైదులుగౌడ్ అన్నారు. రాజకీయ ఉనికి కోసం తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకోని తెలుగుదేవం పార్టీని ఆంధ్ర పార్టీ అని అవహేళన చేసే రాజకీయ ధృతరాష్ట్రులకు ఇటీవల తెలంగాణాలో టీడీపీ అభ్యర్థులు గెలిచి తగిన గుణపాఠం చెప్పారన్నారు. తెలంగాణాలో నాయకులు మాత్రమే లేరు కాని కార్యకర్తలు, పార్టీ క్యాడర్ రూపంలో టీడీపీకి క్షేత్రస్థాయిలో బలంగా ఉందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలంగాణాలో రాష్ట్ర, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షులు వరకు కమిటీలు నియమించాలని కోరారు. పార్టీలో యువతను ప్రోత్సహించి కొత్త నియామకం తరువాత పార్టీ కార్యక్రమాలు విధి విధానాలు తయారు చేస్తే త్వరలో తెలంగాణాలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందన్నారు

## యూరియా సక్రమంగా అందేలా చూడాలి

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్** :అధికారులు రైతులకు అందుబాటులో ఉండి యూరియా సక్రమంగా అందేలా చూడాలని ఆర్డీఓ కృష్ణా రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా బుకింగ్ యాప్ పై భువనగిరిలోని మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ యాప్ ద్వారా యూరియా బుకింగ్ అందుబాటులో ఉన్న ఏ షాప్ నుండి అయిన ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఫెర్టిలైజర్ షాపులో హెల్ప్ డెస్క్ (సహాయక కేంద్రం) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్కడ ఏఈఓలు, జిపిఓలు, పిఎస్‌లు అందుబాటులో ఉండాలని ఆర్డీఓ తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్, తాహాసిల్దారు అంజి రెడ్డి, వ్యవసాయ అధికారి మల్లేశం పాల్గొన్నారు.

## బిల్లును ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వర్ రావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అఖిల భారత రైతు కుల సంఘం ఆధ్వర్యంలో బిల్లు పత్రాలని దగ్ధం చేసి ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీవ్రంగా నష్టం చేసే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిధుల కొరత ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ఎత్తివేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఇందూరి సాగర్, వెంకటర్‌రెడ్డి, కిరణ్, వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.





## ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ప్రజాపక్షం/వలిగొండ :** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించిన వలిగొండ నూతన సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి. వలిగొండ గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం వెంకట్ పాపిరెడ్డి శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి ఈనెల 22న సోమవారం జరిగే తన ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కుంభం విద్యాసాగర్ రెడ్డి, కుంభం ఉపేందర్ రెడ్డి, కుంభం లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, పులగుర్ల జంగారెడ్డి పాల్గొన్నారు.

## పిఏసిఎస్ పోచంపల్లి, జూలూర్ అఫిషియల్ పర్సన్ ఇంచార్జ్‌గా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పిఎసిఎస్ పోచంపల్లి, జూలూర్ అఫిషియల్ పర్సన్ ఇంచార్జ్‌గా కంచర్ల వెంకట్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పిఏసిఎస్ పోచంపల్లి సంఘం పిఐసి కమిటీని రద్దు చేస్తూ సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ కంచర్ల వెంకట్ రెడ్డిని అఫిషియల్ పర్సన్ ఇంచార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్‌జి కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని ఎన్‌జి కళాశాల లో శనివారం నవంబర్ 2025 లో జరిగిన డిగ్రీ మూడు,ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మహాత్మా గాంధీ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి,కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ తో కలిసి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రవికుమార్,డాక్టర్ అంతటి శ్రీనివాస్,సిఓఈ డాక్టర్ డి. మునిస్వామి,అకాడమీ కోఆర్డినేటర్ బి నాగరాజు,ఎం.శ్రీనివాస్ రెడ్డి,జే.నాగరాజు,అడిషనల్ కంట్రోలర్ ఎస్.వాసుదేవ్,ఎన్.వేణు పాల్గొన్నారు.




## పంచాయతీ ఎన్నికల్లో పిఒల సస్పెన్షన్ ఎత్తి వేయాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** చిట్యాల మండలం చినకాపర్తి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సమస్యకు కారణం కానటువంటి పి.ఒ. ల సస్పెన్స్ ని ఎత్తి వేసి వెంటనే రీఇన్ స్టేట్ చేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు సుంకరి బిక్షం గౌడ్,ఎం రాజశేఖర్ రెడ్డి,వెంకులు, డిమాండ్ చేశారు.శనివారం పట్టణములోని పిఆర్‌టియూ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ చినకాపర్తి ఎన్నికలలో పోలింగ్ కౌంటింగ్ అన్ని సక్రమంగా నిర్వహించారని జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారని తెలిపారు. సర్పంచ్‌కి సంబంధించి ఒక అభ్యర్థి యొక్క కొన్ని బ్యాలెట్ పత్రాలు పొరపాటున కౌంటింగ్ కేంద్రంలోని వదిలి వేయడం వల్ల ఆరోఓ ను సస్పెండ్ చేశారు.కానీ దీనికి సంబంధం లేని పదిమంది పీవోలను సస్పెండ్ చేయడం సరైనది కాదన్నారు. 8 రోజులపాటు విధులు నిర్వహించినటువంటి స్టేజి 2 అధికారులకు కేవలం 2000 రూపాయలు ఇవ్వడం సమాజం కాదని దాన్ని సరి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘాల నాయకులు జనార్ధన్,ఇరుగు శ్రీరాములు, రామకృష్ణారెడ్డి పెన్షనర్స్ సంఘం,వివిధ సంఘాల జిల్లా బాధ్యులు కోమటిరెడ్డి నరసింహారెడ్డి,మేకల జాన్ రెడ్డి,పెరుమాళ్ళ వెంకటేశం,నిరంజన్ రెడ్డి, ఎడ్ల సైదులు,నర్రా శేఖర్ రెడ్డి,నలపరాజు వెంకన్న,గాదె వెంకట రెడ్డి,చింతల విజయ్ కుమార్ రెడ్డి,గణేష్ రిటైర్డ్ హెడ్ మాస్టర్స్ సంఘం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సునీత జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి, ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుంటకండ్ల సునీత జగదీష్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజక వర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అపూర్వ బదిరుల పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి, వారికి అన్నదానం చేశారు. బిఆర్ఎస్ పార్టీ అర్బన్ సెక్రటరీ కీసర వేణు గోపాల్‌రెడ్డి, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

**మహిళా నాయకురాళ్ళ ఆధ్వర్యంలో...**

మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి, ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గుంటకండ్ల సునీత జగదీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ మహిళా నాయకురాళ్ళ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల స్రవంతి శ్రీనివాస్‌గౌడ్, సారంగుల కరుణశ్రీ, కల్లెపల్లి మహేశ్వరి, విజయ, పద్మ, రమ, నస్రీన్, స్వాతి, లక్ష్మి పాల్గొన్నారు.

సూర్యాపేట పట్టణంలోని 14వ వార్డులో బిఆర్ఎస్ నాయకుడు మహ్మద్ జాకీర్ (స్నేహ హాస్పటల్) ఆధ్వర్యంలో పలు ఆసుపత్రులలో రోగుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

మాలధారణ స్వాములకు అన్నప్రసాదాలు...

బిఆర్ఎస్ యువ నాయకుడు ఎలక హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో గుంటకండ్ల సునీత జగదీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామంలో సుమారు 50 మంది అయ్యప్ప మాలాధారణ స్వాములకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

## న్యూస్‌లో ఘనంగా రెడ్ కలర్ డే






**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని యాట కన్నా రెడ్డి కాలనీలోని న్యూస్ పాఠశాల వారి న్యూస్ కిడ్స్ ప్లేమెట్ లో రెడ్ కలర్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి తెలిపారు.అదేవిధంగా రంగుల పట్ల చిన్ననాటి నుండి అవగాహన కల్పించడం వలన రంగుల గుర్తింపు, సృజనాత్మకత,మోటార్ నైపుణ్యాలు పెంపొందుతాయని పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి తెలిపారు. చిన్నారి విద్యార్థులు ధరించిన రెడ్ కలర్ దుస్తులతో ఎంతగానో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన చార్టు, పండ్ల నమూనాలు ప్రదర్శించి వాటి ఉపయోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గంట్ల అనంతరెడ్డి,హెడ్ మిస్ట్రెస్ గంట్ల పద్మ, ప్రిన్సిపల్ అలుగుబెల్లి తిరుమల్ రెడ్డి,కిడ్స్ ప్లేమేట్ ప్రిన్సిపల్ అలుగుబెల్లి స్పందన,ఉపాధ్యాయులు కవిత,మాధవి,బిందు,సాయిశ్రీ,వనజ,ఫాతిమా,పర్వత్ రెడ్డి,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యేను కలిసిన వెంకటాపురం నూతన పాలకవర్గం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలో జరిగిన ఎలక్షన్స్‌లో గెలుపొందిన గ్రామ నూతన సర్పంచ్ కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, ఉపసర్పంచ్ ఆరుట్ల ఉదయ్ రెడ్డి, పాలకవర్గం వార్డు మెంబర్లు శనివారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కాంగ్రెస్ బలం మరోసారి రుజువైందని అన్నారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతన వార్డు సభ్యులు నారా నాగరాజు, పల్లెపాటి అనిల్, గుంటి లావణ్య, రాగుల మహేశ్వరి, కొడపాక మహేష్, గ్రామ శాఖ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకానికి మహాత్మ జ్యోతిబాపూలే పేరు పెట్టండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వంపై గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి, పేదలకు ఉపాధితోపాటు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం పేరు మార్చి దాన్ని పూర్తిగా వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవకా మిషన్ బిల్లును తీసుకొచ్చిందని దీని పేరు మార్చాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శినవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ దళితులకు, అంగరాన్నివర్గాలకు, బడుగు, బలహీనవర్గాలకు విద్యను అందించి అస్పృశ్యత, అంటరాని నిర్మూలన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహాత్మ జ్యోతిబాపూలే దంపతుల పేర్లు పెట్టాలని ఆయన ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## రక్తదానం చేసిన ప్రాణదాత



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సూర్యాపేట మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన పోరండ్ల వెంకటయ్య శనివారం నల్లగొండ పట్టణంలోని రివర్ నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్న సందర్భంగా అత్యవసరంగా ఓపాజిటివ్ బ్లడ్ అత్యవసరమని డాక్టర్ తెలియజేయగ ఈ విషయాన్ని జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఫోన్లో సాయిరాం మోటార్స్ అధినేత నల్లగొండ క్లబ్ సభ్యులు గాదె వెంకట్ రెడ్డి కి తెలియజేయగా వెంటనే స్పందించి నల్లగొండ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో తను రక్తదానం చేసి ఆపదలో ఉన్న వెంకటయ్యకి రక్తం అందించి ప్రాణాపాయం నుండి కాపాడి తన మానవత్వాన్ని చాటుకొని ప్రాణదాతగా నిలిచారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి,నేతి విప్లవ కుమార్,గంగాధర శ్రీనివాస్,కొప్పుల సుధాకర్ రెడ్డి,గంగాధర రామ్మూర్తి,దాసిరెడ్డి సత్యనారాయణరెడ్డి,వెన్నమల్ల అంజయ్య, క్లబ్ సభ్యులు వెంకటయ్య,కుటుంబ సభ్యులు రక్తదాతను అభినందించారు.

## విద్యతో సర్వతో ముఖాభివృద్ధి



**ప్రజాపక్షం/హాలియా:** విద్యతో సర్వతోముఖాభివృద్ధి ఉంటుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ దేవనాథ జీయర్ స్వామి వారు అన్నారు. శనివారం ఆయన ధర్మ ప్రచారంలో భాగంగా హాలియాలోని స్థానిక శ్లోక స్కూల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు తెలిసే విధంగా నేటి విద్యా వ్యవస్థ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థలో దేశ సంప్రదాయ్యా, సంస్కృతి ప్రతిబించేలా విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. రామాయణము, మహాభారతం , భగవద్గీత ఏదో ఒక మతానికి ఆపాదించింది కాదని,సమాజంలో వ్యక్తి వికాసానికి ఇవి దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్లోక స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కుకుడాల ఆంజనేయులు,భక్త బృందం పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/హాలియా:** రైతులు పండించిన సన్నధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటకు కట్టుబడి నిన్న రైతుల ఖాతాల్లోకి 500 రూపాయల బోనస్ విడుదల చేయడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. శనివారం హాలియాలో కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి దానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి ఆంజనేయులు నకిరేకంటి సైదులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ చట్టాలు, కాలుష్య నియంత్రణపై అవగాహన

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు, కార్యదర్శి వి.మాధవి లత సూచనల మేరకు శనివారం భువనగిరిలోని జగదేవపూర్ రోడ్డులోని భవన నిర్మాణ కార్మికులకు న్యాయ సహాయ న్యాయవాదులు బి.వెంకటేశం, ఎన్.రాజశేఖర్‌లు పర్యావరణ పరిరక్షణ చట్టాలు, కాలుష్య నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలు, చట్టాలు, బాధితులకు ఉన్న హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సహాయం 15100 అంశాలపై చైతన్యం కలిగించారు.

## దుప్పట్లు పంపిణీ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** చాడ ముత్తి రెడ్డి గూడెం గ్రామాలలో ప్రైమరీ స్కూల్ పిల్లలకు తీవ్రమైన చలి కాలం సందర్భంగా 'సర్వ్ నౌవ్' సోషల్ సంస్థ అధ్యక్షులు సుప్రతిమ్, సుషాంత్‌ల ఆధ్వర్యంలో 50 మంది పిల్లలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ బుడిగే బాలరాజు ఉప సర్పంచ్‌లు దుప్పట్లు పంచారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు చాడ శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, శేఖర్, గ్రామ చర్చ్ పాస్టర్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



## లారీ యజమానుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** లారీ యజమానుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘ సభ్యులు కోరారు. శనివారం లారీ యజమానుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సింగపురం మల్లా రెడ్డి, మర్రి సురేష్‌రెడ్డిలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. పెరుగుతున్న ఇంధన, స్పేర్ పార్ట్స్ ధరలతో లారీల నిర్వహణ కష్టతరంగా మారగా, రహదారి పన్నులు, టోల్ చార్జీలతో నష్టాలు ఎదుర్కొంటున్నామని అన్నారు. సంఘం పరిధిలో సుమారు 2వేల లారీలు ఉండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 600 కుటుంబాలు లారీ ట్రాన్స్‌పోర్ట్ రంగంతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. సుమారు 40 సంవత్సరాలుగా సాగర్ రోడ్డులోని రైల్వే ట్రాక్ సమీపంలో లారీ యార్డు కొనసాగుతుండడంతో రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా లారీ



యార్డు నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో లారీ యార్డుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని, అందుకు నామమాత్రంగా ధరను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పామర్తి కృష్ణ, వల్లె దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నర్సింగ్ బలరాం, బాలకృష్ణ, మాజీ కౌన్సిలర్లు నాగలక్ష్మి, పాతూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడానికి ముందుకు రావాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తనయుడు కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎన్‌జి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన నిర్వాహకులను, రక్తదాతలను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలోపట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివ రామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి,బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్, వార్డు, ఉప సర్పంచ్ అభ్యర్థులు అత్యధిక స్థానాలు గెలిచి సత్తా చాటినందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి పిలాయిపల్లి గ్రామంలోని టిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ బందారపు లక్ష్మణ్ గౌడ్ వర్గం దాదాపు 100 మందికి పైగా కార్యకర్తలు, యువకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో



కాంగ్రెస్ పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. దీంతో ఆ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీకి దెబ్బ తగిలింది. ఈ చేరికతో ఆ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యినట్లే, కాగా బీజేపీ నుండి కొందరు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.



## ప్రేరణాత్మక క్విజ్, స్పెల్ బీ పోటీలు

**ప్రజాపక్షం/నందికొండ:** హిల్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులలో జ్ఞానాభివృద్ధి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో శనివారం క్విజ్, స్పెల్ బీ పోటీ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.కార్యక్రమం అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వెంకటరమణ,ఉపాధ్యాయులు సతీష్ కుమార్,నరసింహారావు, వెంకన్న,రేణుక, సంధ్యా,విజయ అమ్మలతో పాటు ఆదర్శ పాఠశాల చైర్మన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## వైభవంగా క్రిస్మస్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సర్వ మానవ సౌభ్రాతృత్వానికి సర్వ మతాల ఆదరణీయతకు ప్రత్యేకమైన జిల్లా టీఎన్‌జిఓ యూనియన్ జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి కార్యదర్శి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన క్రిస్మస్ పండగ సందర్భంగా వేడుకలను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో యేసు దైవానుగ్రహాన్ని సమస్త ఉద్యోగులకు నాయకత్వానికి ప్రజలకు సమకూరాలని ప్రార్థిస్తూ ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా పిడి రాజకుమార్ పాల్గొన్ని కెక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలోజిల్లాలోని పాస్టర్స్ బిషప్ రెవరెండ్ సమర్పణ,మోజెస్,రాజ్ కుమార్,ప్రభాకర్ ,జయచంద్ర,క్రీస్తు దాసు,ఐజక్,యేసు రత్నం పాల్గొని పాటల ద్వారా ప్రార్థన ద్వారా గ్రీటింగ్స్ ద్వారా దేవుని నామాన్ని ఘనపరిచారు.

## చైర్మన్ నాగరత్నం రాజుకు సత్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ పిఏసిఎస్ చైర్మన్‌గా 70 నెలలు పదవీకాలం పూర్తి చేసుకుని చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసినప్పటినుండి ఇప్పటివరకు విరామం లేకుండా రాష్ట్రంలోనే మొట్టమొదటి స్థానంలో సొసైటీని ముందంజలోపాలనసాగించిన పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు కు కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. మీరు మరెన్నోపదవులుఅధిరోహించాలని ఆకాంక్షిస్తూ వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో అఫీషియల్ పర్సన్ ఇంచార్జ్ జ్యోతి,సిఈఓ అనంత రెడ్డి,స్టాఫ్ అసిస్టెంట్ బి శ్రీనివాస్,జి రామలింగయ్య,పి ఆంజనేయులు,బి.నవీన్,జి రజిత,ఏ నరేష్,టీ.లింగయ్య,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్‌లో ఉద్యమకారులదే గెలుపు

సేవలకు లభించిన గుర్తింపు...

వరుసగా ముగ్గురు సర్పంచ్‌లుగా

3 సార్లు ఎన్నిక...

మండలంలోనే రికార్డు క్రియేట్...

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జిల్లాలో మూడు విడతల్లో కొనసాగిన పంచాయతీ ఎన్నికల్లో చాలా గ్రామాల్లో ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాయకులు డబ్బు, మద్యం, మరేదైనా ఖరీదైన వస్తువులు పంచినప్పటికీ ప్రజలు మాత్రం విజ్ఞతతో ఓటు వేశారు.

సేవే లక్ష్యంగా నాయకులు ముందుకు...

భువనగిరి మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యమకారులు, చిన్ననాటి మిత్రులు జనగాం పాండు, నోముల మహేందర్ రెడ్డి, పుట్టా వీరేష్ యాదవులు తెలంగాణ ఉద్యమకారులగా ఉండి పలు ఉద్యమాలలో పాల్గొన్నారు. అదే పోరాట స్ఫూర్తితో గ్రామానికి సర్పంచ్‌లుగా పోటీ చెయ్యాలని నిర్ణయించుకున్నారు. వరుసగా మూడుసార్లు టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచులుగా పోటీ చేసి గెలుపొందారు. 2013 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో బీసీ మహిళా రిజర్వ్ కావడంతో ఆ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పుట్ట అరుణ వీరేష్ యాదవ్ పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందారు. అలాగే 2019లో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో ఆ గ్రామం జనరల్ మహిళా రిజర్వేషన్ కావడంతో తెలంగాణ ఉద్యమకారుడు నోముల



పద్మా మహేందర్ రెడ్డి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం 2025లో జరిగిన గ్రామంలో ఎస్సీ జనరల్ కాగా తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగాం పాండు ఎన్నికలలో పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందాడు. గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా కొన్ని స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ వారు స్థానిక ఎన్నికల్లో పోటీలో నిలబడ్డారు. గ్రామంలో కొన్ని సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. సేవ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దింతో వరుసగా ఉద్యమకారులు సర్పంచ్ పోటీలో గెలుపొంది మండలంలోని రికార్డు క్రియేట్ చేశారు.

పార్టీని గెలిపించుకోవడమే వీరి లక్ష్యం.....

సర్పంచ్, ఎంపీటీసీలు ఎలక్షన్లు ఏవైనా బీఆర్ఎస్ పార్టీని గెలిపించడమే వీరి ప్రధాన లక్ష్యం. ముగ్గురూ కలిసి సర్పంచులే కాకుండా గతంలో రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీటీసీలుగా పోటీ చేసిన వారిని కూడా ఎంపిటిసిలుగా గెలిపించారు.

## విద్యార్థులకు బహుమతులు

**ప్రజాపక్షం/చండూరు:** ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు కొండాపురం గ్రామానికి నూతనంగా ఎన్నికైన కర్పంచ్ గిరి కరుణాకర్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం కొండాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి సర్పంచ్ గిరి కరుణాకర్ గౌడ్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 7వ తరగతి మొదటి ర్యాంకు విద్యార్థికి 5016 రూపాయలు, సెకండ్ ర్యాంక్ విద్యార్థికి 1000 రూపాయలు ,6వ తరగతి మొదటి ర్యాంక్ విద్యార్థికి 3016 రూపాయలు , సెకండ్ ర్యాంక్ విద్యార్థికి 1000రూయాలు, 5వ తరగతి మొదటి ర్యాంక్ విద్యార్థికి 2016 రూపాయలు, సెకండ్ ర్యాంక్ సాధించిన విద్యార్థికి 1000 రూపాయలు , ఇదే విధంగా అన్ని తరగతుల వారికి బహుమతుల ప్రధానం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూతం ముత్యాలు , ఉప సర్పంచ్ గడ్డం యాదయ్య ,ఉపాధ్యాయులు , పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సోమవారం నుండి యథావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ఈనెల 22 సోమవారం నుండి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు .అందువల్ల జిల్లాలోని ప్రజలు వారి సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి హాజరై వారి ఫిర్యాదులను సమర్పించుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు.

# సంక్రాంతి నాటికి ధంసలాపురం ఆర్‌వోబి పూర్తి

-దేవరపల్లి జాతీయ రహదారితో పలు రాష్ట్రాలు అనుసంధానం
-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారికి సంబంధించి ఆర్‌వోబి పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి శనివారం హైవే పనులను పరిశీలించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే , ఆర్‌వోబి, మున్నేరు బ్రిడ్జి వంతెన పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. 160 కిలో మీటర్ల జాతీయ రహదారి పూర్తి కావడం వల్ల గంటన్నర సమయంలో రాజమండ్రి వెళ్లవచ్చునన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఈ రహదారి ఉపయోగపడడంతో పాటు ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని అనుసంధానం చేసే క్రమంలో పలు రాష్ట్రాలతో రహదారి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఆర్‌వోబి నిర్మాణానికి సంబంధించి హైటెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూ సేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని తెలిపారు. ఒక వైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేస్తే రాజమండ్రి వరకు ఈ రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధిలో జాతీయ రహదారులు ఉపయోగపడతాయని తుమ్మల తెలిపారు. రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రూ. 3,500కోట్లతో నిర్మించే ఈ జాతీయ రహదారికి సంబంధించి చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగు సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేనేజ్‌మెంట్ విద్యార్థులకు స్వాగత వేడుకలు






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి కళాశాలలో మేనేజ్‌మెంట్ విద్యార్థుల స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రంగంలో, వ్యాపారంలో కీలకంగా నిలిచేది మేనేజ్ మెంట్ విభాగమేనన్నారు. ఆర్థిక వ్యవహారాలపై ప్రణాళిక లేకపోవడం వల్ల ఎంతో మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మేనేజ్ మెంట్ విద్యార్థులు ఆర్థిక సంబంధమైన వ్యవహారాలపై నిర్దిష్టమైన వైఖరి కలిగి ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥జి. ధాత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ వంటి టెక్నికల్ విద్యతో పాటు మేనేజ్ మెంట్ కోర్సులకు కూడా డిమాండ్ ఉందన్నారు. అకౌంట్స్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, ఫైనాన్స్ రంగాల్లో మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీచైతన్య మాట్లాడుతూ సరైన ప్రణాళిక కలిగి ఉంటే అవకాశాలు వాటంతట అవే దరి చేరుతాయన్నారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణనిస్తూ టీమ్ లీడర్స్‌గా ఎదిగేందుకు తర్ఫీదునిస్తున్నామన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంబిఏ విభాగాధిపతి డా॥పి. రామకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల తీరుతో సింగరేణి సంస్థకు అప్రతిష్ట

- అధికారుల తీరు మార్చుకోవాలి
- ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణిలో రిటైర్డ్ అయిన కార్మికులకు లాభాల వాట, దీపావళి బోనస్ చెల్లించటానికి క్వార్టర్‌లు ఖాళీ చేయాలనటం అధికారులకు సరికాదని, వారి వ్యవహార శైలితో సింగరేణి సంస్థ అప్రతిష్ట పాలవుతుందని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విశ్రాంత కార్మికులు క్వార్టర్ ఖాళీ చేయకుంటే ఒక గ్రాట్యుటీ మాత్రమే నిలిపివేసేవారని అన్నారు. కానీ క్వార్టర్ ఖాళీ చేయాలనటం ఇదివరకెప్పుడూ లేదన్నారు. గృహాలు ఖాళీ చేస్తేనే లాభాల వాటా, దీపావళి బోనస్‌లు చెల్లిస్తామనటం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వానికి కోట్లకు కోట్లు ఇస్తుందన్నారు. విద్యుత్ సంస్థల నుండి సింగరేణికి రావలసిన వేల కోట్ల బకాయిలను వసూలు చేయకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి సంస్థకు ఎలాంటి సంభంధం లేని జిల్లాలలో కోట్ల నిధులను ఖర్చుపెడుతున్నారని అన్నారు. సంస్థ అభివృద్ధికి తమ జీవితాలను ధారపోసిన కార్మికుల దగ్గరకు వచ్చేసరికి అనేక కొర్రీలు పెట్టడం సంస్థ మనుగడ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు తమ కుటుంబాలతో ఆనవాయితీగా జరుపుకునే సింగరేణి అవతరణ దినోత్సవ వేడుకలకు నిధుల కొరతను సాకుగా చూపించి తక్కువ బడ్జెట్ కేటాయించారని, కొంతమంది అధికారులు కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా కార్మికులను రెచ్చగొట్టే పద్ధతిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. సంస్థ భవిష్యత్‌ను నిర్వీర్యం చేయటానికి పూనుకొన్నారని దీనికి అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇలాంటి వ్యవహారశైలిని అధికారులు పూర్తిగా మానుకోవాలని హితవు పలికారు. లాభాల వాటా, దీపావళి బోనస్‌లు చెల్లించటానికి కార్మికులు క్వార్టర్‌లు ఖాళీచేయాలనటం సబబు కాదన్నారు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అధికారులు వెంటనే స్పంధించి విశ్రాంత కార్మికులకు లాభాల వాట, దీపావళి బోనస్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# నేటి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి : సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నేడు జరగనున్న జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్ దత్ విజ్ఞప్తి చేశారు. చిన్నచిన్న విషయాలకు కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయంతో పాటు ఆర్థికంగా నష్టపోకుండా ఇరువర్గాల వారు జాతీయలోక్ అదాలత్‌కు హాజరై పరస్పర సమ్మతితో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాజీచేసుకునే అవకాశం ఉన్న వివిధ రకాల కేసులు, క్రిమినల్ కంపౌండ్ కేసులు, సివిల్, ఆస్తి తగాదాలు, భర్యాభర్తలు, కుటుంబ సమస్యలు, డ్రంకన్‌డ్రైవ్, మోటారు వాహన చట్టం ఉల్లంఘనలు, చెక్‌బౌన్స్, బ్యాంక్‌రికవరీ తదితర కేసులను ఈ జాతీయలోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సిపి తెలిపారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# లోపభూయిష్టంగా సైన్స్ ఫెయిర్ నిర్వహణ

- డిఆర్‌వోకు ఏఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులకు వసతుల కల్పనలో జిల్లా విద్యాశాఖ విఫలమైందని, లోపభూయిష్టంగా సైన్స్ ఫెయిర్ నిర్వహణ ఉందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం ప్రచార ఆర్భాటమే తప్ప సౌకర్యాలు కల్పించలేదన్నారు. సైన్స్‌ఫెయిర్ వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులకు వసతులు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. ట్రాలీ ఆటోల్లో విద్యార్థులు రావడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సైన్స్‌ఫెయిర్‌పై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివానాయక్, గోపి, పవన్, నరేందర్, కిరణ్ పాల్గొన్నారు.

# బుకింగ్ యాప్‌పై రైతులకు అవగాహన తప్పనిసరి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రైతులకు బుకింగ్ యాప్ పై అవగాహన కలిగి ఉండాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ సూచించారు. మండలం లోని చెరువు మాధారం లో శనివారం రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. బుకింగ్ యాప్ ఎలా చేసుకోవాలో రైతులకు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. సాగు చేసిన పంటలకు సరిపడా యూరియా సకాలంలో అందించే లక్ష్యంతో ప్రభుత్వం యాప్ ను ప్రవేశపెట్టిందని అన్నారు. యూరియా బుకింగ్ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు లోకి తెస్తుందని ఆమె తెలిపారు. రైతులు యాప్ ద్వారా యూరియా ను బుక్ చేసుకోవాలని సూచించారు. రైతులకు యూరియా బుకింగ్ చేసిన వెంటనే బుకింగ్ ఐడీ నెంబర్ అందుతుందని అన్నారు. ఐడీ నెంబర్ తో పాటు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని మరుసటి రోజు లోపు డీలర్ వద్ద యూరియా కొనుగోలుచేయవచ్చునని అన్నారు. రైతులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం నిర్లక్ష్యం

టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ రావు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు ఆరోపించారు. మండలం లోని కొత్తకొత్తూరు లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాలలో దక్షిణాది రాష్ట్రాల పట్ల సవతి తల్లి ప్రేమ వల్లిస్తుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో మారుమూల గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కూడ కల్పించటం లేదని అన్నారు. కొత్తగూడెంకోవ్వూరు రైల్వే లైన్ నేటి వరకు పూర్తి చేయలేదని అగ్రహాం వ్యక్తం చేశారు. కొవ్వూరుభద్రాచలం రోడ్ 140 కి.మీ. నూతన బ్రాడ్ గేజ్ 20082010 బడ్జెట్ లో మంజూరైనప్పటికీ నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల పట్ల కేంద్ర పాలకులకు వున్న శ్రద్ధ అర్థమవుతుందని అన్నారు. పెండింగ్ రైల్వే లైన్ పూర్తి చేయాలనిసంబంధిత కేంద్ర మంత్రి తో పాటు, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు వ్రాయటంతో పాటు క్షేత్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో టీజేఎస్ మద్దతు తో విజయం సాధించిన నూతన సర్పంచ్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యల పై టీజేఎస్ గ్రామాల వారీగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, బీ.రాజేందర్ నాయక్, తీగ రాములు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.